భూమిపై సర్వహక్కులు కల్పించడమే ధ్యేయం

● ఏళ్లనాటి భూ సమస్యలకు పరిష్కారం
● లబ్ధిదారులకు శాశ్వత పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాటసాని



లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని

పాణ్యం: ఏళ్లగా అసైన్డ్ భూమిల్లో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న పేద రైతులకు భూమిపై సర్వహక్కులు కల్పించడమే ధ్యేయంగా ప్రభుత్వం నేడు శాశ్వత పట్టాలు పంపిణీ చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పాణ్యంలోని శ్రీ కృష్ణ కల్యాణ మండపంలో తహసీల్దార్ శ్రీనివాసులు గౌడ్ ఆధ్వర్యంలో 'అసైన్డ్ చేసిన భూములకు పూర్తి యాజమాన్యపు హక్కులతో కూడిన పట్టాల పంపిణీ'' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 2003 కంటే ముందు నుంచి అనుభవంలో ఉంటూ సాగు చేసుకుంటున్న రైతులకు నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయంతో ఆ రైతుల్లో ఎనలేని సంతోషం నెలకొందన్నారు. నేడు ప్రభుత్వం జారీ చేసిన ఈ పట్టాలతో రైతులకు తమ భూమిపై పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. ఏళ్లుగా అనుభవంలో ఉన్న రైతులకు ఎలాంటి హక్కు ఉండేది కాదని, కేవలం సాగు చేసుకునేందుకు మాత్రమే ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో పాణ్యం మండలంలోనే 687మంది రైతులకు 1207.63ఎకరాల భూమికి సంబధించి పూర్తి యాజమన్యపు హక్కు కల్పించామని తెలిపారు.

గత ప్రభుత్వంలో రైతులకు అన్యాయం

గత ప్రభుత్వ పాలనలో అసైన్డ్ రైతులకు పూర్తిగా అన్యాయం చేశారని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆరోపించారు. ఓర్వకల్లు మండలంలో అసైన్డ్ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పరిశ్రమల విస్తరణలో పరిహారం అందకుండా రైతులు సాగులో లేరని చూపించి రైతులను రోడ్డున పడేశారన్నారు. అలాగే పిన్నాపురం విషయంలోనూ ఇలాంటి తప్పిదాలే జరిగాయన్నారు. అసైన్డ్ కమిటీలో పేర్లు ఇచ్చాకా కూడా సాక్షత్తూ అప్పటి కలెక్టర్ నిర్లక్ష్యం చేశారన్నారు. 2019లో అధికారంలోకి వచ్చాక అసైన్డ్ భూములను సాగు చేసిన రైతులకు కూడా పరిహారం అందించేందుకు సీఎం జగన్‌మోన్‌రెడ్డితో చర్చించామన్నారు. రైతు పక్షపాతిగా పేరొందిన సీఎం జగన్ వారికి పరిహారం ఇచ్చేందుకు ఒప్పుకున్నార న్నారు.

రెండు ప్రభుత్వాలకు తేడాను గమనించాలి

గత ప్రభుత్వ, మన ప్రభుత్వ పాలన తీరును గమనించాలని ఎమ్మెల్యే కాటసాని రాభూపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. వ్యవసాయ దండగన్న నాయకులు కూడా వ్యవసాయం గురించి మాట్లాడితే ఎలా అని విమర్శించారు. సీఎం జగమోహరెడ్డి పాలనలో రైతు ముంగిటకే రాయితీలు వచ్చాయని, విత్తు నుంచి విక్రయం వరకు కూడా ప్రభుత్వ అండగా నిలుస్తుందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ ఉసేన్‌బీ వైస్ ఎంపీపీ పార్వతమ్మ, సర్పంచ్ మేకల పల్లవి, మాధవి, శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీలు వరలక్ష్మీ, వెంకటేశ్వర్లు, రవిరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు జాకీర్ ఉసేన్, రామచంద్రుడు, యల్లకిట్టు, బాబు, గురురాజారావు, మండల సచివాలయాల కన్వీనర్ సుమంత్‌రెడ్డి, డీటీ మల్లిఖార్జునరెడ్డి, ఆర్ఐ మహేశ్వరరెడ్డి, ఏఎస్ఓ మహబూబ్‌బాష రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మూడు తరాలుగా ఎదురు చూస్తున్నాం



మూడు తరాలుగా ఈ పూర్తి స్థాయి యాజమన్యపు హక్కు కోసం ఎదురు చూస్తున్నాం. నాకు 1.24ఎ కరాల భూమిని ఏళ్లతరబడి సాగు చేసుకుంటున్నాం. ఎలాంటి పూర్తి స్థాయి హక్కులు లేవు. గతంలో ఎన్ని సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా న్యాయం జరగలేదు. సీఎం జగన్‌మోహరెడ్డి తీసుకున్న ఈ నిర్ణయం మా మూడు తరాల కష్టానికి శాశ్వత పరిష్కారం చూపారు. చాలా సంతోషంగా ఉంది. సీఎంతోపాటు ఎమ్మెల్యే కాటసానికి కృతజ్ఞతలు. – **సుంకరి ముంతాజ్‌బేగ్, లబ్ధిదారురాలు, పాణ్యం**

టీడీపీ అసత్యాలను తిప్పికొడదాం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న నాయకులు

కల్లూరు: టీడీపీ చేస్తున్న అసత్యాలు, ఆరోపణలను తిప్పికొడదామని కల్లూరు అర్బన్ జెసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్ గోవర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్ జయరాముడు, కల్లూరు అర్బన్ క్లస్టర్–1 అధ్యక్షుడు భీమా శంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కల్లూరు అర్బన్ 30వ వార్డు శరీన్‌నగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎందుకు జగనన్నే కావాలి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనకు వైఎస్సార్ సీపీ అందిస్తున్న సుపరిపాలనలో తేడాను గమనించాలన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు హేమలత, శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



రైతులతో వీఏడీ శివకుమార్

సి.బెళగల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పశు సంక్షేమ పథకాలను పాడి, గొర్రెలు, మేకల పెంపకందారులు, రైతులు సద్వినియోగం చేసుకోవాలి వీఏడీ శివకుమార్ సూచించారు. శుక్రవారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని పశు వైద్యశాలలో డాక్టర్ ప్రవీన్‌కుమార్ పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. పాడి, గొర్రెలు, మేకల పెంపకం రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీఏడీ అధిక పాల దిగుబడులు, గొర్రెలు, మేకల పెంపకం తీరుపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పశువైద్యశాల రికార్డులను, మందు నిల్వలు, కేసుల వివరాలను వీఏడీ తనిఖీ చేశారు. అనంతరం రైతులకు నులిపురుగు నివారణ మందులు, కాల్షియం, హిప్‌గ్రో టానిక్‌లను ఉచితంగా పంపిణీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు

గూడూరు రూరల్: గుడిపాడు సమీపంలో శుక్రవారం రెండు ద్విచక్ర వాహనాలు ఢీ కొనడంతో ఐదుగురికి గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నుంచి దైవందిన్నెకు ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వెళ్తున్నారు. అదేవిధంగా ఇద్దరు యువకులు, ఓ మహిళ బైక్‌పై వెళ్తున్నారు. వెనుక నుంచి ముందు వెళ్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తూ ఢీకొంది. ఈ ప్రమాదంతో రెండు బైక్‌లపై ప్రయాణిస్తున్న ఐదుగురు గాయపడ్డారు. రోడ్డుపై వెళ్తుతున్న వాహనచోదకులు 108కి సమాచారం అందించగా గాయపడిన వారిని కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని తడకనపల్లె గ్రామానికి చెందిన షేక్ జుబేదాబి, షేక్ సలాం అల్లాపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. ఎస్ఐ నల్లప్ప తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గురువారం గ్రామ సచివాలయం దగ్గర సీసీ కృష్ణుడు ఆధ్వర్యంలో పొదుపు మహిళ సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జుబేదాబీ సీసీతో వాదనకు దిగింది. సీసీ పక్కన ఉన్న మల్లెపోగు జయమ్మతో గొడవ పెట్టుకుని, కొట్టి, దుర్భాషలాడి కులం పేరుతో దూషించి అవమానించింది. గొడవ విషయాన్ని జుబేదా బీ అక్క అయిన గ్రామ సర్పంచ్‌తో జుబేదాబిని మందలించమని చెప్పడానికి ప్రయత్నిస్తుండగా మరొకసారి జుబేదాబీ ఆమె కుమారుడు షేక్ సలాం అల్లా ఇరువురు కలిసి జయమ్మను కొట్టి, దుర్భాషలాడి కులం పేరుతో తిట్టి అవమాన పరిచారు. మల్లెపోగు జయమ్మ ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి

గడివేముల: మహాత్మ గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గతంతో పోలిస్తే ఈ ఏడాది అవినీతి, అక్రమాలు తగ్గాయని నంద్యాల జిల్లా పీడీ రామచంద్రారెడ్డి అభిప్రాయ పడ్డారు. మండల కేంద్రమైన గడివేముల ఎంపీడీఓ కార్యాలయ అవరణంలో మండల సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2022 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు 761 పనులకు గాను రూ.67,90,7601 కోట్లు జరిగిన పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. గ్రామాల్లో జరిగిన ప్రతి పనిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని దుర్వేశి రూ. 3209,బూజునూరు రూ.2400, బొల్లవరం రూ. 636 అక్రమాలు జరిగినట్లు గుర్తించి రికవరి చేయడం జరిగింది. ఈ సందర్భంగా పీడీ రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పనులతో ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడటంతో పాటు ఆర్థికంగా ఎదుగుదలకు ఎంతోగానో ఉపయోగం ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పింఛన్ అధికారిణి సరస్వతి, ఏపీడీ బాలాజీ నాయక్, క్వాలిటీ కంట్రోలర్ అధికారి గంగాధ్రి, ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప,పీఆర్ ఏఈ భాస్కర్,ఎస్ఆర్‌పీ నీలకంఠం,ఏపీఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో లేవుట్లను అభివృద్ధి పరచాలి

సి.బెళగల్: మండల అధికారులు సమన్వయంతో పనిచేసి జగనన్న కాలనీలోని లేవుట్లను అభివృద్ధి పరచాలని జిల్లా మత్స్యశాఖ డీడీ, మండల ప్రత్యేకాధికారిణి శ్యామల సి.బెళగల్ మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె మండల పరిధిలోని బురాన్‌దొడ్డి గ్రామంలోని జగనన్న లేవుట్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులతో డీడీ మాట్లాడారు. సమస్యలను పరిష్కరించేందుకు అధికారులందరు చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులుకు డీడీ సూచించారు. వీరి వెంట హౌసింగ్ ఏఈ సుమంత్, వర్క్ ఇనిస్పెక్టర్ రంగన్న, ఇంజనీర్ అసిస్టెంట్ శాంతి, లబ్ధిదారులు ఉన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పరచండి

● ఆర్‌డీఓ హరిప్రసాద్



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ హరిప్రసాద్

ఓర్వకల్లు: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించాలని కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాద్ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 19న రానున్న నేపథ్యంలో శుక్రవారం మండలంలోని నన్నూరు జెడ్పీ హై స్కూల్‌లో విద్యా దీవెన, జగనన్న గోరుముద్ద (మధ్యాహ్న భోజనం) పథకాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం ప్రాణేశ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆర్డీఓ హరిప్రసాద్ మాట్లాడుతూ మనబడి నాడునేడు పథకం ద్వారా ప్రభుత్వం ప్రతి పాఠశాల రూపురేఖలు మార్చిందన్నారు. విద్యా దీవెన పథకం ద్వారా అర్హులైన పేద విద్యార్థులకు కళాశాల చదువుల నిమిత్తం అవసరమైన ఫీజులను ప్రభుత్వం చెల్లిస్తుందని గుర్తు చేశారు. అలాగే పాఠశాల విద్యార్థులకు విద్యా కానుక కిట్లను అందజేయడం, నాణ్యతతో కూడిన రుచికరమైన భోజనం వడ్డించడం జరుగుతోందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యలో రాణించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, వీఆర్‌ఓలు శ్రీధర్, కృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ విద్యార్థిని జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కి ఎంపిక



సాయిప్రియను అభినందిస్తున్న పాఠశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

కల్లూరు: కేజీబీవీ లక్ష్మీపురం (మైనార్టీ) పాఠశాలకు చెందిన సాయిప్రియ జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైంది. ఈ నెల 13న గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్–బాల బాలికల అథ్లెటిక్స్‌లో పాల్గొన్న సాయిప్రియ 100 మీ. స్ప్రింట్‌లో రెండవ స్థానం సాధించి రజత, 400 మీటర్ల నందు మూడవ స్థానంలో కాంస్య పతకాన్ని సాధించినట్లు ప్రిన్సిపల్ ఉమాదేవి గురువారం తెలిపారు. త్వరలో జరగబోయ్యే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధిస్తుందని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించిన సాయిప్రియను ప్రిన్సిపల్, పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

పేదల అభివృద్ధే లక్ష్యం



హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న సర్పంచ్ మద్దిలేటి

కల్లూరు: రాష్ట్రంలో పేదల అభివృద్ధే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని కె.మార్కాపురం సర్పంచ్ గణ మద్దిలేటి అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయంలో భూమి కొనుగోలు పథకంలో భాగంగా ఎస్సీ కార్పొరేషన్ అందించిన భూములకు సంబంధించి సంపూర్ణ యాజమాన్య హక్కులు అందించే పత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని ఆర్‌బీకే, వైఎస్సార్ హెల్త్ సెంటర్, గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వీఆర్వో ఖాజన్న, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శాస్త్ర వేత్తలుగా ఎదగాలి

గూడూరు: విద్యార్థులు భావి శాస్త్ర వేత్తలుగా ఎదగాలని మండల విద్యాశాఖాధికారులు కే.సునీలమ్మ, నాగరాజులు పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలురు, బాలికలు పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోకారి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఎంఈఓలు ఎగ్జిబిషన్‌నున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైన్స్ అండ్ టెక్నాలజీ తోనే మన దేశం ఎంతో పురో అభివృద్ధి చెందిందని అన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను వారు తిలకించారు.

గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి



గిరిజన శంఖారావం పోస్టర్లలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గిరిజనుల అభ్యున్నతికి కృషి చేస్తుందని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే స్వ గృహంలో జనవరి 7న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే గిరిజన శంఖావారం పోస్టర్లను గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, బంజార ధర్మసేన రాష్ట్ర అధ్యక్షుడు రాజారాం నాయక్‌తో కలిసి ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజనులు ఐక్యమత్యంతో ఉంటే మరింత అభివృద్ధి చెందుతారన్నారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించి వారి ఆర్థిక స్థితిగతులను అడిగి తెలుసుకుని సమస్యలను పరిష్కారం దిశగా కృషి చేస్తున్నానన్నారు. గిరిజన శంఖారావం బహిరంగ సభకు కుటుంబ సభ్యులతో తరలివచ్చి జయప్రదం చేయాలని రాజారాం నాయక్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుడంబాయ్ తాండ సర్పంచ్ శ్రీనివాస్ నాయక్, జీపీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బైజూస్ కంటెంట్‌పై రామోజీ తప్పుడు రాతలు

● ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఐక్యరాజ్య సమితికి వెళ్లేలా పేద పిల్లలను తయారు చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతిఒక్కరూ అభినందిస్తుంటే ఎల్లో మీడియా మాత్రం రోతరాతాలకు పాల్పడుతుందని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం పాణ్యంలోని శ్రీకృష్ణ కల్యాణ మండపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎల్లోమీడియా తప్పుడు రాతలను ఎమ్మెల్యే కాటసాని ఖండించారు. ఈనాడు దినతిపత్రికలో బైజూస్ కంటెంట్‌పై రామోజీరావు రాసిన రాతలపై ఆయన మండిపడ్డారు. స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్నప్పటికీ ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం విద్యకు ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందని, పేద విద్యార్థులు సైతం ఇంగ్లిష్ విద్యను అభ్యశించేలా చర్యలు తీసుకుందని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నాడు నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చేశారని, అమ్మఒడి, విద్య, వసతి దీవెనలు అందజేస్తూ పేదల విద్యాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నారని వివరించారు. అదేవిధంగా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తుంటే... ఎల్లోమీడియా ఓర్వలేక పిచ్చిరాతలు రాస్తుందని ధ్వజమెత్తారు. విదార్థులు ట్యాబ్‌ల మూలంగా పెడదోవ పడుతున్నారంటూ చిన్నారులపై నీచపు రాతలు ఏ మాత్రం సమంజసం కాదని తప్పుపట్టారు. ఇలాంటి రాతలతో పత్రికనే ప్రజల్లో అబాసుపాలవుతుందన్నారు. వృద్ధ వయస్సుల్లో కూడా పచ్చి అబద్ధాలు రాసి టీడీపీకి రామోజీ వంతపాడుతున్నారని విమర్శించారు.

పెత్తందారులు పిల్లలు ట్యాబ్‌లు చూడడం లేదా?

రామోజీ మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు కాదా... వారు ట్యాబ్‌లు చూడడం లేదా అని ఎమ్మెల్యే కాటసాని ప్రశ్నించారు. చంద్రబాబుకు, పవన్‌కల్యాణ్‌కు కుమారుడు, కుతుళ్లు ఉన్నారు కాదా... వారు ట్యాబ్‌లు చూడడం లేదా అని నిలదీశారు. వారి కంటే గొప్ప అడ్వాన్స్ టెక్నాలజీతో ల్యాబ్ ట్యాబ్‌లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పిల్లలు వాడుతుంటే ఓర్వలేక పిచ్చివాగుడు సిగ్గుచేటన్నారు. ప్రతి గ్రామీణ ప్రాంత పిల్లలకు ట్యాబ్‌లు ఉండాలనే ఉద్దేశంతో సీఎం జగన్ 5.50లక్షల మందికి ఉచితంగా ట్యాబ్‌లు అందించారన్నారు. దీనిపై ప్రతిపక్షాలు, పచ్చ మీడియా బహిరంగా చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుమంత్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాబు, శేషారెడ్డి, ఉమేష్‌రెడ్డి, రామచంద్రుడు, ఎల్లకిట్టు తదితరులు పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగాల ఆధారంగా బీమా

గడివేముల: పంట కోత ప్రయోగాలలో ఒక గ్రామంలోని నాలుగు ప్రయోగాలలో వచ్చిన దిగుబడుల సరాసరి ఆధారంగా పంట బీమాను ప్రభుత్వం నిర్ణయిస్తుందని ఏఓ హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని గని గ్రామంలో శుక్రవారం వరి పంటపై డాక్టర్ వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం, ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం కింద పంట కోత ప్రయోగం నిర్వహించారు. రైతు ఎల్లావత్తుల వెంకటరమణ పొలంలో 25 చదరపు మీటర్లలో పంట కోత ప్రయోగం చేయగా 12 కేజీల 960 గ్రాములు దిగుబడి వచ్చిందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి వెంకటేశ్, గ్రామ వ్యవసాయ అధికారి హరిచంద్ర, వీఏఏ జయశ్రీ పాల్గొన్నారు.

22న బహిరంగ వేలం పాటలు

గడివేముల: మండల కేంద్రం గడివేములలో వెలసిన శ్రీ మూలపెద్దమ్మ అమ్మవారి ఆలయంలో దుకాణాల నిర్వహణకు సంబంధించి ఈనెల 22న బహిరంగ వేలంపాటలు నిర్వహిస్తున్నట్లు ఈఓ మోహన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంవత్సరం పాటు టెంకాయలు, పూలు, పూల దండలు విక్రయించుకునేందుకు ఆసక్తిగల వ్యక్తులు వేలం పాటలో పాల్గొనాలని ఈఓ సూచించారు.

గుండ్రేవులలో పంటకోత ప్రయోగం

సి.బెళగల్: మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు పంట కోత ప్రయోగంను చేపట్టారు. పొలంలో పంటను కోతకోసి, నూర్పిడి చేసి ధాన్యం కొలత వేశారు. సదరు విస్తీర్ణంలో 12 కేజీల 390 గ్రాముల వరి ధాన్యం దిగుబడి అయ్యిందని, ఈమేరకు ఎకరాకు 23 క్వింటాళ్ల దిగుబడి సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర అర్ధగణాంక అధికారి సాంబశివుడు, సచివాలయ ఎంపీఈఓ సోమేశ్వరి, పంటబీమా కోఆర్డీనేటర్ ముస్తక్, వీఆర్‌ఏలు రంగన్న, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

వంతెనను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు: మండలంలోని నన్నూరు వద్ద గల జాతీయ రహదారిపై నూతనంగా నిర్మించిన ఫుట్ ఓవర్ వంతెనను ప్రయాణికులు సక్రమం సద్వినియోగం చేసుకోవాలని రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌వే ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్టు ప్రతినిధి మధన్‌మోహన్ అన్నారు. శుక్రవారం నన్నూరు వద్ద జాతీయ రహదారిపై నిర్మించిన ఫుట్ వే వంతెన పూర్తయిన సందర్భంగా ఆయన పరిశీలించారు. మధన్‌మోహన్ మాట్లాడుతూ దాదాపు రూ.1 కోటితో నిర్మించిన వంతెన వలన నన్నూరు గ్రామ ప్రజలు, పాఠశాల విద్యార్థులతో పాటు, చుట్టు ప్రక్కన గల గ్రామాల ప్రజల సౌలభ్యంగా వుంటుందన్నారు. ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఫుట్ వే వంతెన కోసం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడం జరిగిందన్నారు. త్వరలోనే ఈ వంతెనను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభోత్సం చేసి, జాతికి అంకితం చేస్తామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఈపీఎల్ సంస్థ రూట్ ఆఫీసర్ రంజిత్‌రెడ్డి, కుతుబుద్దీన్, నిర్వహనాధికారి గౌరినాయుడు, సేఫ్టీ మేనేజర్ ఖదర్‌వలి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికితీయాలి



సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన నమూనాను పరిశీలిస్తున్న ఎంఈఓ వసంతలక్ష్మి

కోడుమూరు రూరల్: సైన్స్ ఎగ్జిబిషన్ ద్వారా విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలను వెలికితీసేందుకు ఎంతగానో దోహదపడతాయని కోడుమూరు ఎంఈఓ వసంతలక్ష్మి అన్నారు. శుక్రవారం కోడుమూరులోని బాలుర హైస్కూల్లో ఏర్పాటు చేసిన మండల స్థాయి ఎగ్జిబిషన్‌ను ఎంఈఓ వసంతలక్ష్మి హెచ్‌ఎం తైమూర్‌బాషాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల విద్యార్థులు మ్యాథ్స్, కంప్యూటర్ సైన్స్, ఇంజినీరింగ్ సైన్స్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎన్విరాల్‌మెంట్ సైన్స్, బయో సైన్స్‌లకు సంబంధించి తయారు చేసిన నమూనాలను ఎంఈఓ పరిశీలించారు. నమూనాలకు సంబంధించిన అంశాలపై విద్యార్థులతో చర్చించారు. ఎనిమిది నమూనాలను మండల స్థాయిలో ఎంపిక చేసి ఈనెల 16న జిల్లా స్థాయిలో జరిగే సైన్స్ ఎగ్జిబిషన్‌కు పంపుతున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై జెడ్పీ సీఈఓ సమీక్ష



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి

కోడుమూరు రూరల్: మండల కేంద్రం కోడుమూరులో శనివారం నిర్వహించనున్న వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంపై శుక్రవారం జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీఈఓ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి కేంద్ర సమాచార ప్రసారాల శాఖ సహాయ మంత్రి దేవుసిన్హ్ చౌహాన్, జిల్లా అధికారులు హాజరవుతారని, అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతిని వివరిస్తూ స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సభా వేదిక ప్రాంగాణానికి సంబంధించి ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓను సీఈఓ ఆదేశించారు. సమావేశంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏఓ రవిప్రకాష్, ఏపీఎం పుష్పావతి, ఏఈలు గంగరాజు, ప్రసాద్, హెచ్‌ఓ మదన్‌మోహన్, ఈఓఆర్డీ మంజుల, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీపీ వెంకటేశ్వరమ్మ

కర్నూలు సిటీ: పేదల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డా.జరదొడ్డి సుధాకర్ అన్నారు. సీఎం జగనన్న నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలను అమలు చేస్తుంటే పెత్తందారులు తట్టుకోలేకపోతున్నారని, అసత్యారోపణలు చేస్తున్నారని విమర్శించారు. కర్నూలు రూరల్ మండల పరిధిలోని ఉల్చాల గ్రామంలో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే ఎందుకు కావాలంటే ? అనే అంశంపై శుక్రవారం జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, మండల పరిషత్ అధోక్షురాలు డి.వెంకటేశ్వరమ్మ, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు డి.వాసులు హాజరయ్యారు. ముందుగా గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేశారు. ఆ తరువాత గ్రామ సచివాలయంలో ఆ గ్రామంలోని వారికి అందిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. దేశంలో ఎక్కడ లేని విధంగా అన్ని వర్గాల పేదలకు సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. ఒకప్పుడు సంక్షేమ పథకాల కోసం రాజకీయ నాయకుల చుట్టూ తిరిగినా న్యాయం జరిగేది కాదన్నారు. ప్రస్తుతం సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా అర్హత ఉంటే చాలు ఇళ్ల దగ్గరకే చేరుతున్నాయని గుర్తు చేశారు. ఆధార్, రేషన్‌కార్డు తీసుకుని సచివాయానికి వెళ్తే ఏ పథకానికి అర్హులు అనే విషయం సిబ్బంది చెబుతున్నారన్నారు. ఉల్చాల గ్రామానికి సంక్షేమ పథకాల ద్వారా రూ.23,35,81,305 ప్రత్యక్ష, పరోక్ష విధానాల్లో లబ్ధి చేకూరిందని గుర్తు చేశారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అనురాధ, మండల కన్వీనర్ మహబూబ్ బాషా, సర్పంచ్ విద్యాసాగర్, నిడ్జూరు సత్యం రెడ్డి, గార్గేయపురం కౌశిక్ రెడ్డి, రవిరెడ్డి, గొర్రెల సొసైటీ చైర్మెన్ గోకారి, షేక్ ఖాలం, వార్డు సభ్యులు మల్లకల్, శ్రీధర్, రాముడు, తదితరులు పాల్గొన్నారు.